క్లుప్తంగా

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు



వల్లూరులో వాహనాలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రాజరాజేశ్వరి

కపిలేశ్వరపురం: ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన తనిఖీల్లో భాగాంగా గ్రామాల్లో గురువారం ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించింది. తహసీల్దార్ రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో ఈ తనిఖీ బృందం వల్లూరు, వెదురుమూడి, నేలటూరు తదితర గ్రామాల్లో వాహనాలను తనిఖీ చేశారు. దీనిలో వీఆర్వో అవిడి శ్రీనివాస్, మహిళా పోలీస్ గెడ్డం ప్రమీల, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పటిష్టంగా ఎన్నికల కోడ్ అమలు



టేకిలో గ్రామ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ కొండలరావు

కపిలేశ్వరపురం: మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ)ను పటిష్టంగా అమలు చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు ఎంసీసీ అమలు కమిటీ కో ఆర్డినేటర్, ఎంపీడీఓ కొండలరావు అన్నారు. మండలంలోని కపిలేశ్వరపురం, టేకి, మాచర తదితర గ్రామాల్లో పలు శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల్లో రాజకీయ నాయకులు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఫొటోలు చిత్రాలు లేకుండా చర్యలు తీసుకున్నదీ లేనిదీ పరిశీలించారు. ఎన్నికల కోడ్ నియమ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహనతో మెలగాలని ఎంపీడీఓ కొండలరావు అన్నారు.

చలివేంద్రం ప్రారంభం



పసలపూడిలో ప్రయాణికులకు మజ్జిగ అందజేస్తున్న సుబ్బారెడ్డి తదితరులు

రాయవరం: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు పసలపూడిలో వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో రెండు చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని పారిశ్రామికవేత్త కొవ్వూరి నివాసరెడ్డి ప్రారంభించారు. గత పదేళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేసి, ప్రజల, వెదురుపాక–పసలపూడి, మండపేట–కాకినాడ ప్రధాన రహదారి వెంబడి ప్రయాణించే ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్నట్టు సుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పోతంశెట్టి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు



సంఘటన స్థలంలో ఉన్న కారు

కె.గంగవరం: రాజువేరి ఏటిగట్టు వద్ద కారు అదుపు తప్పిన సంఘటన బుధవారం సాయంత్రం జరిగింది. ఏటిగట్టుపై రాజువేరి శివారున ఉన్న ఇరుకు వంతెనతో పాటు, ప్రమాదకర మలుపు ఉంది. ఈ ప్రాంతంలో గతంలో అనేక ప్రమాదాలు జరిగి, పలువురు మృత్యువాత పడ్డారు. గ్రామానికి చెందిన యువకులు చొరవ చూపి, ప్రమాదం జరగకుండా రోడ్డు పక్కన ఇనుప రాడ్లతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఇలా ఉండగా యానాం నుంచి కోటిపల్లి వైపు వస్తున్న కారు అదుపుతప్పి.. కాలువ గట్టు వరకు వచ్చి ఆగిపోయింది. అటుగా వెళ్తున్న గ్రామస్తులు గమనించి, కారులో ఉన్న వారిని, కారును సురక్షితంగా గట్టుపైకి చేర్చారు. ఫెన్సింగ్ లేకపోతే ప్రాణనష్టం జరిగేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ధ్వంసమైన ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయిస్తానని కారు యజమాని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

శ్మశాన వాటిక నిర్మాణ పనులు



కోరుమిల్లిలో శ్మశాన వాటిక నిర్మాణ పనులు చేస్తున్న కూలీలు

కపిలేశ్వరపురం: కోరుమిల్లి శ్మశాన వాటిక నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు కాగా గత కొద్ది రోజులుగా పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే పంచాయతీ నిధులతో బోరు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. పుష్కరఘాట్ సమీపంలో నిర్మిస్తున్న శ్మశాన వాటికతో అంత్యక్రియలు, కర్మకాండల ప్రక్రియలకు అనువుగా ఉండనుంది.

జననికి రక్ష

- మాతా, శిశు సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం
- ప్రభుత్వాస్పత్రిలో పెరిగిన సాధారణ ప్రసవాలు
- గతానికి భిన్నంగా వైద్య సేవలు
- తల్లీబిడ్డ వాహనం ద్వారా ఇంటికి..

రామచంద్రపురం: మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలను తీసుకుంటోంది. గతానికి భిన్నంగా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రుల్లో గర్భిణులకు వైద్య సేవలను మెరుగు పర్చటంతో ప్రభుత్వాస్పత్రుల్లోనే పురుడు పోసుకునేందుకు అధిక శాతం మొగ్గు చూపుతున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ, జనని సురక్ష పథకాల ద్వారా ప్రోత్సాహకాలను అందజేస్తోంది. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో ఆరు నెలల్లో 838 మంది గర్భిణులకు వైద్యులు సమర్థవంతంగా డెలివరీలు చేశారు.

గతంలో నిరాశ

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పురుడు పోసుకోవాలంటేనే గర్భిణులు భయపడేవారు. వైద్యులు లేక, మందులు లేక, సరైన సౌకర్యాలు లేక ఎంతో ఇబ్బందులు పడేవారు. ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి, వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితులుండేవి. అప్పట్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు దాదాపు జరిగేవి కావు. డెలివరీ కోసం వెళ్లిన గర్భిణులకు సిజేరియన్ తప్పనిసరి అన్నట్టుగా చేసేవారు.

నెల	మొత్తం డెలివరీలు	నార్మల్ డెలివరీలు
ఏప్రిల్	66	52
మే	70	70
జూన్	74	67
జూలై	78	63
ఆగస్టు	80	75
సెప్టెంబర్	69	50
అక్టోబర్	56	43
నవంబర్	73	65
డిసెంబర్	61	59
జనవరి 24	85	71
ఫిబ్రవరి 24	78	69
మార్చినెల ఇప్పటివరకు	48	35
మొత్తం	838	754

నిపుణులైన వైద్యుల పర్యవేక్షణ

ఏరియా ఆస్పత్రిలో నిపుణులైన గైనకాలజిస్టులతో గర్భిణులను నిరంతర పర్యవేక్షణతో వైద్య సేవలను అందిస్తున్నారు. మొదటి నెల నుంచి డెలివరీ డేట్ వరకు ఏరియా ఆస్పత్రిలో సేవలందిస్తున్నారు. అవసరమైతే తప్ప మిగిలిన సమయంలో సాధారణ ప్రసవాలనే చేస్తున్నారు. ప్రతి నెలలో 32 నుంచి 40 వరకు అంటే ఏరియా ఆస్పత్రికి వచ్చే గర్భిణులలో సుమారుగా 90 శాతం వరకు సాధారణ ప్రసవాలు జరుగుతున్నాయి.

ఆరోగ్యశ్రీ ద్వారా ఆసరా

ప్రభుత్వాస్పత్రుల్లో డెలివరీ అయిన బాలింతలకు ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా ఆసరా కల్పిస్తోంది. సాధారణ ప్రసవాలతో పాటుగా, సిజేరియన్ అయిన వారికి కూడా ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన మరుసటి రోజునే రూ.4 వేలు తల్లుల ఖాతాలకు ప్రభుత్వం జమ చేస్తోంది. అదనంగా ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ అయిన బాలింతలకు జననీ సురక్ష ద్వారా అదనంగా మరో రూ.వెయ్యి వారి ఖాతాలకు జమ చేస్తోంది. ఆస్పత్రిలో డెలివరీ అయిన బాలింతలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన తల్లీబిడ్డ వాహనం ద్వారా ఉచితంగా వారి ఇంటి వద్దకు చేరుస్తున్నారు. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వాస్పత్రుల్లో అధిక శాతం గర్భిణులకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించటంతో, పేదలతో పాటుగా మధ్య తరగతి ప్రజలు కూడా ప్రభుత్వాస్పత్రులనే ఆశ్రయిస్తున్నారు.



ఏరియా ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ కిట్‌తో బాలింతను డిశ్చార్జి చేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

ఏరియా ఆస్పత్రిలో మెరుగైన సేవలు



కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వం ఏరియా ఆస్పత్రుల్లో మెరుగైన సేవలను అందిస్తోంది. గతానికి భిన్నంగా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తోంది. దీంతో ఆస్పత్రిలో డెలివరీకి వచ్చే వారి సంఖ్య పెరిగింది.

– తొగరు మూర్తి, డైరెక్టర్, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ

నార్మల్ డెలివరీలకు ప్రాధాన్యం



ప్రభుత్వాస్పత్రుల్లో గర్భిణులకు ప్రభుత్వం మెరుగైన వైద్య సదుపాయాలను కల్పిస్తోంది. సాధారణ ప్రసవం ద్వారా మహిళలు ఆరోగ్యం బాగుంటుంది. తొలిసారి గర్భిణులకు సాధ్యమైనంత వరకు నార్మల్ డెలివరీ అయ్యేలా చూస్తున్నాం. రెండోసారి గర్భిణులకు మొదటి సిజేరియన్ అయితే రెండోసారీ సిజేరియన్ తప్పనిసరి. ప్రభుత్వాస్పత్రిలో నార్మల్ డెలివరీకి ప్రయత్నిస్తున్నాం.

– ఎస్.ప్రవీణ్‌కుమార్, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి

బెంబేలెత్తిస్తున్న కోతులు



శీల గ్రామ వీధుల్లో సంచరిస్తున్న కోతులు

కాజులూరు: మండలంలోని శీలలో ఇటీవల కోతులు గుంపులుగా సంచరిస్తూ రైతులను తీవ్రంగా నష్టాలపాల్జేస్తున్నాయి. గ్రామ వీధుల్లో కోతుల హల్‌చల్‌కు స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. కొబ్బరి, మామిడి చెట్ల నుంచి కాయలు, పిందెలను తుంచి పారేస్తున్నాయి. పంటపైనా కోతులు దాడి చేసి, చిరుపొట్టదశలో ఉన్న వరిమొక్కలను నాశనం చేస్తున్నాయి. దీంతో తమకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని రైతులు వాపోతున్నారు. గ్రామంలో ఇళ్లపై కోతులు పరుగులు తీస్తుండడంతో, తాటాకిల్లు, పెంకుటిళ్ల పైకప్పులు జారిపడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. చిన్నారులు, మహిళలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులపైనా కోతులు దాడి చేస్తాయేమోనని తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. తాళ్లరేవు అభయారణ్యం సమీపం కావటంతో, అక్కడి నుంచి కోతులు గ్రామానికి చేరుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి, కోతుల బెడదను నివారించాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

మేట్లు పారదర్శకంగా పని చేయించాలి

ఉపాధి హామీ ఏపీడీ మల్లికార్జునరావు

కొత్తపేట: ఏప్రిల్ ఒకటి నుంచి ఎంజీఎన్ఆర్‌జీఎస్ పనులు ప్రారంభం కానున్నాయని, ఈ నేపథ్యంలో మేట్లు పారదర్శకంగా పని చేయాలని ఉపాధి హామీ ఏపీడీ జీవీకే మల్లికార్జునరావు అన్నారు. మేట్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం స్థానిక ఎన్ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగింది. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ ఏప్రిల్, మే, జూన్ నెలల్లో 12 వారాల పని దినాలు కల్పిస్తామన్నారు. మేట్లు గ్రామంలో కొలతల ప్రకారం పని చేయించాలన్నారు. పనికి తగ్గ వేతనం మాత్రమే మంజూరు అవుతుందన్నారు. నేషనల్ మొబైల్ మేనేజ్‌మెంట్ సిస్టంలో పనికి రాగానే, మొదట ఫొటో అప్లోడ్ చేయాలన్నారు. అనంతరం నాలుగు గంటల వ్యవధిలో మరో ఫొటో ఓపెన్ చేయాలన్నారు. అప్పుడు మాత్రమే అప్లై అవుతుందన్నారు. ఒకవేళ అటెండెన్స్ పడకపోతే వేతనం లేనట్టేనని స్పష్టం చేశారు. మేట్లు సమగ్రంగా, పారదర్శకంగా పని చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.వాణి, ఏపీడీ సీబీ బీజీ కవిత, ప్లాంటేషన్ మేనేజర్ ఎం.త్రినాథ్, సీఓలు ఫణికుమార్, భారతి, మండల ఫీల్డ్ అసిస్టెంట్లు వాడ ప్రకాష్, చెప్పిడి శ్రీహరి, కోటిపల్లి సత్యనారాయణ కె.శేషగిరిరావు, సీహెచ్ రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ మల్లికార్జున్

కోలాహలంగా ప్రభ ఊరేగింపు

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామ శివారు తోటమెరకలో కొలువుదీరిన పెద్దింట్లమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం ప్రభ ఊరేగింపు కోలాహలంగా జరిగింది. గరగ నృత్యాలు, బుట్ట బొమ్మల ప్రదర్శన, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ ప్రభ ఊరేగింపు ఆద్యంతం కన్నుల పండువలా జరిపించారు. భక్తులు రెట్టించిన ఉత్సాహంతో ఊరేగింపులో పాల్గొన్నారు. నెల రోజుల పాటు జరిగే అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగింది. ఈ నెల 26న అమ్మవారి జాతర జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

ప్రజల మేలు కోరే ప్రభుత్వానికి మరోసారి అవకాశం

కపిలేశ్వరపురం (మండపేట): ప్రజల మేలు కోరి సంక్షేమాన్ని అమలు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మరోసారి అవకాశం ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ కురుపూడి భవాని, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు అన్నారు. మండపేట మండలం ఏడిద, కేశవరం, జెడ్ మేడపాడు, ద్వారపూడి, వెలగతోడు గ్రామాల్లో గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో క్షేత్ర స్థాయిలో ప్రజల వద్దకు వెళ్లే విషయంపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిన నేపథ్యంలో ప్రజల్లో సానుకూల వైఖరి ఉందని భరోసా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కురుపూడి రాంబాబు, పోతుల దుర్గాప్రసాద్, గారపాటి అశోక్ కుమార్, బూరిగ ఆశీర్వాదం, పలివెల సుధాకర్, పెదపాటి సత్యనారాయణమూర్తి, అన్నందేవుల కృష్ణారావు, తోరం శ్రీను, దేవు ప్రసాదనాయుడు, ఈతకోట కిన్నెర, దంతులూరి శ్రీరామవర్మ, తులా శేషారావు, చిక్కాల శ్రీనివాసరావు, కృపానందం, ఈదర వీరాస్వామి, సాదే పిడుగు రాముడు పాల్గొన్నారు.



ఏడిదలో కార్యకర్తలతో మాట్లాడుతున్న పాపారాయుడు, పృథ్వీరాజ్

అవగాహన లోపంతోనే ఆక్వా నష్టాలు

కాజులూరు: టెక్నీషియన్ల కొరత, అవగాహన లోపాల కారణంగానే ఆక్వా సాగులో రైతులు తరచూ నష్టాల పాలవుతున్నారని కాకినాడ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి మురళీమోహన్ అన్నారు. గురువారం మండలంలోని గొల్లపాలెం, ఇతర గ్రామాల్లో ఆయన ఆక్వా రైతులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోస్తా తీరంలో ఆక్వా సాగు రోజురోజుకూ విస్తరిస్తోందన్నారు. టెక్నీషియన్ల కొరత కారణంగా రైతులకు సరైన సూచనలు అందడం లేదన్నారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర మత్స్య శాఖ కాకినాడలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్లలో టెక్నీషియన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించటంతో పాటు, ఇతర ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు వృత్తిపరమైన శిక్షణను ఇస్తోందని చెప్పారు.

పాఠశాలకు ఐరన్ బీరువా బహూకరణ



సిబ్బందికి బీరువాను బహూకరిస్తున్న రామారెడ్డి

రాయవరం: పసలపూడి కర్రి సుబ్బారెడ్డి మండల పరిషత్ మెయిన్ ప్రాథమిక పాఠశాలకు గురువారం దాత ఐరన్ సేఫ్ బీరువాను బహూకరించారు. పాఠశాలలో రికార్డులు భద్రపర్చుకోవడానికి ఐరన్ సేఫ్ బీరువా అవసరమని హెచ్ఎం కోరుమిల్లి వెంకటరమణ పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రగతి రామారెడ్డిని కోరారు. దీనికి సమ్మతించిన రామారెడ్డి రూ.25 వేలు విలువ చేసే ఐరన్ సేఫ్ బీరువాను పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా రామారెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి, సహకారం అందిస్తానన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంపుదలకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రగతి రామారెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి.విజయకుమార్, కాలిశెట్టి శ్రీనివాస్, నల్లమిల్లి భాస్కరరెడ్డి, బి.సూరిబాబు, కిలపర్తి శ్రీనివాసరావు, ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

కాండం తొలిచి.. నడ్డి విరిచి..

- వరిపై కాండం తొలుచు పురుగు దాడి
- నివారణ చర్యలు చేపట్టాలంటున్న వ్యవసాయ నిపుణులు

అంబాజీపేట: వరి పైరుపై కాండం తొలుచు పురుగు అధికంగా కనిపిస్తోందని, రైతులు గమనించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాండం తొలుచు పురుగు ఆశించిన వరి చేలల్లో 30 శాతం వరకు నష్టం కలుగుతుందని తక్షణమే నివారణ చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు.

మూడు నియోజక వర్గాల్లో మొత్తం 50,093 ఎకరాల్లో వరి సాగవుతోంది. పి.గన్నవరం నియోజకవర్గంలో 22,384, కొత్తపేట నియోజకవర్గంలో 18,322, రాజోలు నియోజకవర్గంలో 9,387 వేల ఎకరాల్లో రబీ సాగు జరుగుతోంది. ప్రస్తుతం దాళ్వా పంట పొట్ట పోసుకునే దశలో ఉంది.

పురుగు లక్షణాలు

పసుపు రంగు కాండం తొలుచు పురుగు, ఆడ రెక్కల పురుగు గడ్డిరంగులో ఉండి, ముందు జతరెక్కల మధ్యలో నల్లటి మచ్చ కలిగి ఉంటుంది. కందిగింజ పరిమాణంలో ఉండి, గుడ్ల సముదాయాలను ఆకు చివర భాగాన పెడుతుంది. ఒక్కొక్క గుడ్ల సముదాయంలో 50–80 గుడ్లు ఉండి, గోధుమ రంగు వెంట్రుకలు కప్పబడి రక్షణ పొందుతాయి.



కాండం తొలుచు పురుగు ప్రభావంతో ముక్కామలలో నాశనమైన వరి పంట

పంట నాశనం ఇలా..

గుడ్లు 5–8 రోజుల్లో పొదగబడి, లార్వాలు బయటకు వస్తాయి. వాటి నోటి నుంచి వెలువడే తీగలాంటి లాలాజలం సహాయంతో కాండం కిందకు వేలాడి, నీటి ఉపరితలం వద్ద వరికాండానికి రంధ్రాలు చేసి, లోపలకు ప్రవేశిస్తాయి. ఇవి 4–7 దశల్లో పెరిగి, కాండం మొదలుకు చేరుకుని, ప్యూపా దశకు చేరుకుంటాయి. తొలి దశలో లార్వాలు ఆకు చివరన గోకి తినడం వల్ల ఆ ప్రదేశంలో వెడల్పాటి తెల్లటి చారలు ఏర్పడతాయి. తర్వాత లార్వాలు కిందకు వేలాడి, కాండం కణుపు వద్ద రంధ్రం చేసి, లోపలకు ప్రవేశించి.. కొరికి తినడం వల్ల మొవ్వ భాగం చనిపోతుంది. అలాగే అతిగా ఎరువులు, పురుగు మందుల వినియోగం వల్ల పంటకు నష్టం వాటిల్లుతుంది. వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎరువులను, పురుగు మందులను వినియోగించడం వల్ల పంట దిగుబడి అధికంగా వస్తుంది.

తెల్లకంకి వచ్చే అవకాశం!



వరిలో చిరుపొట్ట దశలో కార్బోసిరాన్ 3జీ గుళికలు పది కిలోలు ఎకరానికి వేయాలి. లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8 కిలోలు వేయాలి. నివారణ చర్యలు చేపట్టకపోతే తెల్లకంకి వచ్చే అవకాశం అధికంగా ఉంది. ఈ సమయంలోనే గుళికలు తప్పనిసరిగా వేయడం వల్ల పంటను సంరక్షించుకోవడంతో పాటు, దిగుబడులు సాధించుకోవచ్చు. గుళికలు వేయలేని పక్షంలో కార్టప్ హైడ్రోక్లోరైడ్ మందును స్ప్రే చేయవచ్చు.

– సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ఏఓ, అంబాజీపేట

బీమా చెక్కుల అందజేత

పి.గన్నవరం: పోతవరం గ్రామంలోని ధనవర్ష సహాయ సహకార పొదుపు సంఘంలో సభ్యులైన ఇసుకపూడి గ్రామానికి చెందిన ఇద్దరు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. వారి కుటుంబాలకు మంజూరైన బీమా సొమ్ము రూ.లక్ష వంతున రెండు చెక్కులను సంఘ చైర్మన్ కంకిపాటి ప్రసాద్ గురువారం అందజేశారు.


నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి

అయినవిల్లి: ఇంటి పన్నుల వసూళ్లపై అమలాపురం డివిజన్ పంచాయతీ అధికారి బి.రాజు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 31 నాటికి అన్ని గ్రామ పంచాయతీలు నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. ఈఓపీఆర్డీ మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మామిడికుదురు: మగటపల్లికి చెందిన నామన ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం తొమ్మిది మంది నిరుపేదలు, దివ్యాంగులకు ఆర్థికసాయం అందించారు. ఒక్కొక్కరికీ రూ.5 వేల వంతున రూ.45 వేలను ఫౌండేషన్ చైర్మన్ నామన రాంబాబు ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ నామన కృష్ణవేణి స్మారకార్థం ఈ సంస్థను ఏర్పాటు చేసి, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.

ఘనంగా ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



కొత్తకోట రోడ్డులోని అభయాంజనేయ స్వామి

కె.గంగవరం: కోట శివారు కొత్తకోట రోడ్డు వద్ద ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయ మూడో వార్షికోత్సవాన్ని గురువారం గ్రామస్తులు, కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా స్వామివారితో పాటు, ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం నుంచి ఆలయం వద్ద వేద పండితులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది.

వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకులు పెద్దింటి వెంకటలక్ష్మీ నరసింహాచార్యులు పర్యవేక్షణలోని ప్రసన్నకుమార్ భార్గవ్, మురళీకృష్ణమాచార్యులు స్వామికి విశేషార్చనలు, నిత్యహోమాలు, బలిహరణ పూజలు చేశారు. ఉత్సవ నిర్వహణ కమిటీ చైర్మన్ ముత్తా అబ్బు, అంగర పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు, ప్రజాప్రతినిధులు, ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ కూలర్ వితరణ



మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో నీటిశుద్ధి పరికరాన్ని ప్రారంభిస్తున్న హెచ్ఎం

కపిలేశ్వరపురం: మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలకు అదే పాఠశాలలో చదువుకున్న పదో తరగతి విద్యార్థులు రూ.10వేలు విలువ చేసే నీటిశుద్ధి పరికరాన్ని సమకూర్చారు. పరికరాన్ని విద్యార్థుల చేతుల మీదుగా గురువారం హెచ్ఎం రమాదేవికి అందజేశారు. చదువుకున్న పాఠశాలకు తమవంతుగా సేవ చేయాలన్న తపనతో వాటర్ కూలర్‌ను అందజేసినట్టు విద్యార్థులు తెలిపారు. వారిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

భగత్‌సింగ్ జీవితంపై నేడు సమాలోచన సదస్సు

కపిలేశ్వరపురం: డాక్టర్ చెలికాని స్టాలిన్ ఆధ్వర్యంలో రామచంద్రపురంలోని డాక్టర్ చెలికాని రామారావు స్మారక భవనంలో శుక్రవారం 'భగత్‌సింగ్ ఆలోచన–ఈ నాటి ఆవశ్యకత' అనే అంశంపై సమాలోచన సదస్సు నిర్వహించనున్నట్టు సామాజిక కార్యకర్త పెద్దిశెట్టి రామకృష్ణారావు గురువారం తెలిపారు. వీక్షణం మాస పత్రిక నిర్వాహకులు ఎన్.వేణుగోపాల్ ప్రధాన అంశంపై ప్రసంగించనున్నారన్నారు. చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు హాజరవుతారన్నారు.

పలువురికి సూర్యప్రకాశ్ పరామర్శ



సత్తిబాబును పరామర్శిస్తున్న సూర్యప్రకాశ్ తదితరులు

రామచంద్రపురం: వైఎస్సార్ సీపీ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ పట్టణంలోని పలువురిని గురువారం పరామర్శించారు. పట్టణంలో 12వ వార్డు బ్రాడీపేటకు చెందిన మాజీ కౌన్సిలర్, న్యాయవాది పాకలపాటి గోపి తండ్రి వీరన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను సూర్యప్రకాశ్ కలిసి పరామర్శించారు. రత్నంపేటలో వట్టికూటి రామం భార్య ఇటీవల మరణించారు. ఆయనను, వారి కుటుంబీకులను సూర్యప్రకాశ్ పరామర్శించారు. చప్పిడివారి సావరానికి చెందిన ఉండి సత్తిబాబు తల్లి ఇటీవల మృతి చెందారు. సత్తిబాబును, ఆయన కుటుంబ సభ్యులను సూర్యప్రకాశ్ పరామర్శించారు. మున్సిపల్ కౌన్సిలర్లు పోతంశెట్టి గోపాలకృష్ణ, పెంటపాటి శ్రీనివాసరావు, బంగారు బాబు తదితరులు పాల్గొన్నారు.

అంగర పశువైద్యుడి సస్పెన్షన్

కపిలేశ్వరపురం: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు అంగర పశు వైద్యాధికారి వీవీ రమణమూర్తిని ఈ నెల 18న ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్టు తెలియవచ్చింది. ఉన్నతాధికారులు అంగర ఆసుపత్రిని తనిఖీ చేసేందుకు వచ్చినప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు సమాచారం.